క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకుల కుటుంబాలకు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి గురువారం రాత్రి ఆర్థిక సాయం అందించారు. మార్టూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన తాళ్లూరి ప్రభుదాస్, పాలపర్తి శ్రీను అనే ఇద్దరు యువకులు ఇటీవల పర్చూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. విషయం తెలిసిన మధుసూదన్‌రెడ్డి మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి ద్వారా రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.20 వేల చొప్పున రెండు కుటుంబాలకు రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అడకా గంగయ్య, ఉప్పలపాటి అనిల్ చౌదరి, తమ్ములూరి సురేష్, భుక్యా చిన్న నాయక్, ఖాదర్‌బాషా, అట్లూరి జైపాల్, అట్లూరి వెంకయ్య., లింగారావు, కృష్ణారావు, ప్రేమ్‌రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నగదు చోరీపై కేసు

పర్చూరు(చినగంజాం): ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోని నగదును దోచుకెళ్లిన ఘటనలో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై మాల్యాద్రి వివరాల మేరకు.. పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామంలోని రేగులగడ్డ సత్యవతి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటిలోని బీరువాలో నగదు రూ. 15 వేలు దొంగిలించుకొని వెళ్లారు. బాధితురాలు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వీధుల వెంట చెత్తా, చెదారం వేస్తే చర్యలు

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని ఈవోఆర్డీ రామకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని తోటవారిపాలెం గ్రామ పంచాయితీలో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈవోఆర్డీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు వచ్చి చెత్త సేకరిస్తున్నారని ఇంటి నుంచి వచ్చే చెత్తను కార్మికులకు అందించాలన్నారు. అలా కాకుండా ఇళ్లల్లోని చెత్తను బయటకు తీసుకొచ్చి రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో వేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు కూడా చేపడుతున్నామన్నారు. సిబ్బంది అలసత్వం వహించకూడదన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పర్చూరులో ఉచిత కంప్యూటర్ శిక్షణ

పర్చూరు(చినగంజాం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌లో కంప్యూటర్ కోర్సు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి పీ ప్రణయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు జిల్లాలోని వనరులు డిమాండ్ ఆధారంగా కంప్యూటర్ కోర్సు ఉచితంగా అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శేషుకుమారి తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు మే 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్టిఫికెట్‌లు ఇస్తున్నాయని, స్కిల్ హబ్ ఇన్‌చార్జి పీ వినోద్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు 63027 64962 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

చీరాల అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైపీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.ప్రణయ్ గురువారం తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీయువకులు జిల్లాలోని వనరులు, డిమాండ్ ఆధారంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలలు ఉచితంగా అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మురళి తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు యువతీ, యువకులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను అందిస్తుందని స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ఎం.హారిక తెలిపారు.

పాలిసెట్‌లో అద్దంకి విద్యార్థికి రాష్ట్రస్థాయి ర్యాంకు


జీ హర్షిత్

అద్దంకి రూరల్: అద్దంకికి చెందిన బత్తుల హర్షిత్ ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్‌లో రాష్ట్రస్థాయిలో 330వ, పాలిసెట్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 1304 సాధించాడు. ఏపీఆర్‌జేసీలో 150 మార్కులకు 121 మార్కులు, పాలిటెక్నిక్‌లో 120 మార్కులకు 111 మార్కులు సాధించి స్టేట్ ర్యాంకులను కైవసం చేసుకున్నాడు విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్లా.. అడవి దారులా!

- లింక్ రోడ్ల అభివృద్ధిలో కంకరతో సరి
- 30 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న ప్రజలు


అంబడిపూడి–ఇసుక దర్శి మధ్య కంకర లేచిన లింకు రోడ్డు


ముక్తేశ్వరం–గుంటుపల్లి మధ్య రోడ్డు కమ్మిన చిల్లచెట్లు

బల్లికురవ: ఏడాది కూటమి పాలనలో ఒక్కటంటే ఒక మంచిపని చేయలేకపోయింది. మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత చేతులెత్తేసింది. వరుసగా గెలుస్తున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గంలో గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలోని లింకురోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా అసంపూర్తిగా నిలిచాయి. ఫలితంగా వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ముక్తేశ్వరం–గుంటుపల్లి గ్రామాల మధ్య అంబడిపూడి–ఇసుక దర్శి గ్రామాల మధ్య లింకు రోడ్ల అభివృద్ధికి గత ప్రభుత్వం 2020–21 ఉపాధి హమీ పథకంలో రూ. 3 కోట్లు నిధులు కేటాయించింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మట్టిరోడ్లను చదును చేసి చేతులు దులుపుకున్నాడు. తారు వేయడంలో మూడేళ్లుగా జాప్యంతో బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లోని 30 గ్రామాల ప్రజలకు నరకయాతన తప్పడంలేదు. ఈ పరిస్థితులకు తోడు లింక్‌రోడ్లను చిల్లచెట్లు కమ్మడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కాంట్రాక్టర్‌ల చేత పనులు చేయించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు సైతం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అసంపూర్తి రోడ్లకు తారువేయించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

వీరజవాన్ మురళి నాయక్‌కు నివాళులు


మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తండా యువకులు

మార్టూరు: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా వీరమరణం పొందిన జవాన్ మురళినాయక్‌కు ఘన నివాళులర్పించారు. గురువారం మండలంలోని నాగరాజు పల్లి తండా వాసులు మురళీ నాయక్ చిత్రపటానికి స్థానిక యువకులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అనంతరం మురళి నాయక్ చిత్రపటంతో పాటు జాతీయ జెండాలు చేతబూని తండా నుంచి మార్టూరు వరకు సుమారు 7 కిలో మీటర్లు బైక్ పై ర్యాలీగా బయలుదేరి మార్టూరు జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తండావాసులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం.. పుడమితల్లికి నైవేద్యం


ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులను సత్కరిస్తున్న ఏడీఏ, తదితరులు


ప్రకృతి సేద్యంపై ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

యద్దనపూడి: ప్రకృతి సేద్యం.. నేల తల్లికి నైవేద్యం లాంటిదని పర్చూరు డివిజన్ వ్యవసాయ సహయ సంచాలకుడు ఎస్. మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పూనూరు గ్రామ సచివాలయంలో ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2025–26 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పచ్చిరొట్ట సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన పంటకు ముందు దుక్కుల్లో నవధాన్యాల సాగు చేపట్టం ద్వారా నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలయదున్నడం ద్వారా సేంద్రియ కర్బన శాతం పెరిగి సూక్ష్మజీవుల జీవవైవిధ్యం పెంపొందుతుందన్నారు. ఏడాదిలో 365 రోజులు భూమిని బహుళ పంటలతో కప్పి ఉంచటం ద్వారా నీరు ఆవిరి కాకుండా నేల గుల్లబారుతుందన్నారు.

సారవంతమైన మట్టికి నష్టం..

ప్రపంచ వ్యాప్తంగా ఎఫ్‌పీఓ గణాంకాల ప్రకారం భూముల్లో ఉన్న సారవంతమైన మట్టి వర్షం కారణంగా కొట్టుకుపోతుందని, రాష్ట్రంలో ఏటా హెక్టారుకు 15 నుంచి 30 టన్నుల వరకు సారవంతమైన మట్టి కొట్టుకుపోతుందని అధ్యయనాల్లో వెల్లడైందన్నారు. దీని నివారణకు భూమిని పలుపంటలతో పూర్తిగా కప్పి ఉంచటం ద్వారా నేల కోతకు గురికాకుండా ఉంటుందని సూచించారు. అలాగే వాతావరణ వైపరీత్యాలు తట్టుకునే సామర్థ్యం భూమికి పెరుగుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 12 మంది రైతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలో 'ప్రకృతి సేద్యం చేద్దాం.. పుడమితల్లిని కాపాడుకుందాం' అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మేరమ్మ, మాజీ సర్పంచ్ బోయపాటి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజు, వీఆర్వో వసంతరావు, వీఏఏలు హరీష్, వినయ్, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటపాటలూ ముఖ్యమే


కారంచేడు గ్రంథాలయం వద్ద క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు


సంతమాగులూరు విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

కారంచేడు: పాఠశాల తరగతి గదుల్లో బోధించే చదువులతో పాటు మానసిక, శారీరక వికాసానికి అవసరమైన ఆట, పాటలు కూడా ముఖ్యమేనని గ్రంథపాలకుడు నాగయ్య అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడు చెరువు కట్టమీద ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి తరగతుల్లో భాగంగా క్యారమ్స్, షటిల్, పరుగు పందేలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు చివరిలో బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలు ఎంతో ఉపయోగం

అద్దంకిరూరల్: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో మేలు కలగజేస్తాయని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజభాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాయలంలో విద్యార్థులకు దేశభక్తి, మహనీయుల గురించి వివరించి పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో 19 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


చీరాలలో వేసవి శిక్షణ శిబిరాలకు హాజరైన విద్యార్థులు

చీరాల అర్బన్: శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు డీ ధనమ్మ గురువారం తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల చేత నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు చదివించి వారిచేత కథలు చెప్పించారు. ఇంగ్లిషు ఫ్యాకల్టీ షేక్ కమల్‌బాబు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు నిర్వహించారు. కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం గ్రంథాలయాన్ని సాయంత్రం వరకు తెరచి ఉంచుతున్నట్లు ఆమె తెలిపారు.

కౌలు రైతు కార్డులతో ఉపయోగాలు


ముప్పవరంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు


యద్దనపూడిలోలో మాట్లాడుతున్న తహసీల్దారు రవికుమార్


ఆదిపూడిలో కౌలు కార్డులు అందిస్తున్న తహసీల్దారు, ఏఓలు

జే.పంగులూరు: రైతుల వద్ద నుంచి కౌలుకు పొలం తీసుకున్న రైతులు తప్పనిసరిగా సాగు హక్కు పత్రం (కౌలు రైతు కార్డు) తీసుకోవాలని మండల తహసీల్దార్ పీ సింగారావు అన్నారు. మండల పరిధిలోని ముప్పవరం, కొండమూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం పంట సాగు హక్కు పత్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కౌలు రైతు కార్డుల వలన పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వలన కలిగితే పంట నష్టపరిహారం, వ్యవసాయ రుణాలు తదితర ఉపయోగాలు గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈఏడాది కౌలు రైతు కార్డులు మండలంలో 21 గ్రామాలకు 2500 వరకు ఇవ్వాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క కౌలు రైతు కార్డులు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పొలం కౌలుకు తీసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవడానికి వీఆర్వోని కాని, గ్రామ వ్యవసాయ సహాయకుడిని కలిసి కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి..

యద్దనపూడి: రైతుల వద్ద పొలాలను కౌలుకు తీసుకొని సాగుచేసే కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దారు రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన యద్దనపూడిలో వ్యవసాయాధికారి మేరమ్మ అధ్యక్షతన కౌలు రైతులకు కార్డులు మంజూరు విషయమై సమావేశం నిర్వహించారు. కౌలుకు తీసుకున్న రైతులు సీసీఆర్సీ కార్డులు పొందడం ద్వారా పంటనష్ట పరిహారం, రాయితీపై ఎరువులు, పురుగుమందులు ఆయా బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్‌కార్డు, పాస్‌బుక్ జిరాక్సులను వీఆర్వోకు అందజేస్తే గుర్తింపు కార్డు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో వీఏఏ వినయ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

రుణ అర్హత కార్డుల కోసం అర్జీలు..

తిమిడెదపాడు (కారంచేడు): రుణ అర్హతలు పొందేందుకు వీలుగా ప్రభుత్వం కౌలు రైతులకు అందిస్తున్న కార్డుల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ అర్జీలు పెట్టుకోవాలని తహసీల్దారు జీ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని ఆదిపూడి, తిమిడెదపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని రైతులు తమ భూములను సాగు చేసే కౌలు రైతులకు కౌలు కార్డులు అందించేలా వారికి సహకరించాలన్నారు. కౌలుదారులకు ఈ కార్డులు ఇవ్వడం వలన భూమిపై ఎటువంటి హక్కులుండవన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, రాయితీలు పొందేలా వీలుంటుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలయిన జీలుగ, జనుము విత్తనాలు అవసరమైన రైతులు కూడా రైతు సేవా కేంద్రాలలో అర్జీలు పెట్టుకోవాలని ఆయన కోరారు. అనంతరం అర్హులైన కౌలుదారులకు కార్డులు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఏఓ కే సుధీర్ బాబు, సర్పంచ్ సుబ్బులు, వైస్ ప్రెసిడెంట్ రంగ నాయకులు, వీఆర్ఓ మత్తయ్య, వ్యవసాయ సహాయకులు ఎం శాంతి, టీ వెంకటప్పయ్య, రైతులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు ఆపాలని వినతి


గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్

మేదరమెట్ల: చెరువుకు సంబంధించిన భూమిలో అక్రమ తవ్వకాలు ఆపాలని గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కొరిశపాడు మండలంలోని అనమనమూరు గ్రామంలో గల పెద్ద చెరువుకు సంబంధించిన భూమిలో రియల్టర్‌లు, కొంతమంది గ్రామస్తులతో కలసి గ్రావెల్ అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్నారని దీనిని వెంటనే నిలుపుదల చేయాలంటూ గ్రామానికి చెందిన పలువురు గురువారం తహసీల్దార్ సుబ్బారెడ్డిని కలసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామానికి సంబంధించిన శ్మశాన వాటికకు చెందిన మైదానం గుంతల్లో నుంచి మెరకగా ఏర్పాటు చేసుకునేందుకు తమకు గ్రావెల్ కావాల్సి వస్తుందని, కాగా గత పది రోజులుగా టిప్పర్లతో ఇతర గ్రామానికి చెందిన వారు అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ఈ అక్రమ తవ్వకాలను తక్షణమే నిలుపుదల చేయాలని వినతి పత్రంలో గ్రామస్తులు కోరారు.

ముఖ మండప నిర్మాణానికి విరాళం


ఏసీ తిమ్మనాయుడుకు విరాళం అందజేస్తున్న దాతలు

అద్దంకి: మండలంలోని శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ముఖ మండప నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పట్టణానికి చెందిన చిన్న సుధాకరరావు జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని లక్ష్మీ తులశమ్మ కుమారుడు శ్రీహరిరావు, ఆయన ధర్మపత్ని ఉమాదేవి రాతి ముఖ మంటప నిర్మాణానికి రూ.1,01,116 విరాళంగా అందజేసినట్లు ఏసీ తిమ్మనాయుడు తెలిపారు.

నాగండ్లలో కలశాల గ్రామోత్సవం


కలశాల గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని నాగండ్ల గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను గురువారం ప్రారంభించారు. అంకురార్పణ కార్యక్రమంలో భాగంగా మేళతాళాలతో కలశాల గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు కార్యనిర్వాహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

జాతీయ రహదారి పనులకు సహకరించాలి


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

జే.పంగులూరు: జాతీయ రహదారి పనులకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పీ సింగారావు పేర్కొన్నారు. బెంగళూరు నుంచి విజయవాడ వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే మండల పరిధిలోని కళ్యాపురం నుంచి ముప్పవరం వరకు సుమారు 2 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి రహదారి నిర్మాణానికి భూసేకరణకు మొగ్గు చూపని రైతులతో గురువారం తహసీల్దార్, రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న మేఘ సంస్థ ప్రతినిధులు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భూసేకరణ జరిపిన విధానం, రైతులకు అందుతున్న నష్ట పరిహారం, రైతులకు జరిగే ప్రయోజనాలు వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రేపు వాడరేవు పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు గ్రామంలో కొలువైన గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి 14 వార్షికోత్సవ తిరునాళ్లను శనివారం నిర్వహిస్తున్నామని దేవస్థాన కమిటీ, గ్రామ పెద్దలు గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నామని ప్రత్యేక పూజలు, శిడిమాను ఉత్సవం, విద్యుత్ ప్రభలతో పాటుగా సత్యహరిశ్చంద్ర నాటకం, సంగీత కచేరి ఏర్పాటు చేస్తున్నామని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీ నిర్వాహకులు సూచించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని గోపాలపురం వద్ద గురువారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన అంజయ్య అనే వ్యక్తి రోడ్డు దాటే క్రమంలో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో అంజయ్యకు తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు సాయం అభినందనీయం

చీరాల రూరల్: విద్యార్థుల భవిష్యత్తులకు చేయూతనివ్వడం అభినందనీయమని ఏఎంసీ చైర్మన్ కొతవరపు జనార్దన్ అన్నారు. గురువారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన నియోజవర్గపరిధిలోని 18 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున రూ. 18 వేల నగదును ఏఎంసీ చైర్మన్ చేతులు మీదుగా అందజేశారు. పందిళ్లపల్లి హైస్కూల్లో 596 మార్కులు సాధించిన దివ్యశ్రీకి న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్ రూ. 11,116 అందజేశారు. ఇంటర్‌లో స్టేట్ మూడో ర్యాంక్ సాధించిన విష్ణుప్రియకు దోగుపర్తి వెంకట సురేష్ జన్మదినం సందర్భంగా రూ. 4,116 అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్. బాల వెంకటేశ్వరరావులు నక్కల సురేష్‌బాబు, చారుగుళ్ల గురుప్రసాద్, హేమంత్‌కుమార్, రాఘవరావు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి సందర్భంగా శ్రీరామనామ సప్తాహం

పర్చూరు(చినగంజాం): హనుమజ్జయంతి సందర్భంగా పర్చూరు వేణుగోపాలస్వామి దేవస్థానంలో అద్దంకి నాంచారమ్మ భక్త సమాజం వారిచే శ్రీరామ నామ సప్తాహం గురువారం ప్రారంభించారు. ఏడు రోజుల పాటు నిర్విరామంగా ఈనెల 22వ తేదీ హనుమజ్జయంతి వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ పూజారి బృందావనం సత్యనారాయణచే విశేష అలంకరణలు, విశేష పూజలు, పూర్ణాహుతి జరుగనున్నట్లు తెలిపారు. జయంతి రోజున 108 సార్లు హనుమాన్ చాలీసా నిర్వహించనున్నట్లు ఈవో దామా నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్త రావువారి వెంకట శివప్రసాద్‌లు తెలిపారు.